మళ్లీ ఉరికొయ్యకు నేతన్న!

- ఐదునెలల హస్తం పాలనలో మళ్లీ చీకటి రోజులు
- దొరకని ఉపాధి.. ఆగుతున్న గుండెలు
- 4 నెలల్లో ఐదుగురి బలవన్మరణం
- కేటీఆర్ లేఖ రాసినా పట్టని సర్కారు

ఆత్మహత్య చేసుకున్న అడిశర్ల సాయి కుటుంబ సభ్యులను ఓదారుస్తున్న కేటీఆర్ (ఫైల్)

కరీంనగర్, ఏప్రిల్ 26(నమస్తే తెలంగాణ ప్రతినిధి/ రాజన్న సిరిసిల్ల, నమస్తే తెలంగాణ): సిరిసిల్ల మళ్లీ ఉరిసిల్లగా మారుతున్నది. ఐదునెలల హస్తం పాలనలో, జీవనాధారం కరువై నేతన్నలు బలవన్మరణాలకు పాల్పడుతున్నారు. సమైక్య రాష్ట్రంలో మాదిరిగానే ఆకలిచావులు ఆరంభమయ్యాయి. అగ్గిపెట్టెలో పట్టే చీరను నేసే అద్భుత ప్రతిభ గల మన నేతన్నలపై ఆనాటి సమైక్య రాష్ట్రం ఆదరణ చూపకపోవడంతో.. సిరిసిల్ల మరణ మృదంగమైన విషయం తెలిసిందే. స్వరాష్ట్రం సాధించిన తర్వాత కేసీఆర్ ప్రభుత్వం నేతన్నల కష్టాలు, కన్నీళ్లను తొలగించి వారి జీవితాల్లో వెలుగులు నింపింది. ఇప్పుడు మళ్లీ చీకట్లు అలుముకుంటున్నాయి. చేతినిండా పని కల్పించకపోగా, ఇవ్వాల్సిన బకాయిలు చెల్లించక పోవడంతో బతుకులు భారంగా మారి నూలు పోగునే ఉరితాడుగా మార్చుకొని ప్రాణాలు తీసుకుంటున్నారు. రెండు రోజుల్లో ముగ్గురు కార్మికులు చనిపోవడం కాంగ్రెస్ నిర్లక్ష్యానికి పరాకాష్టగా నిలుస్తోంది.

సమైక్య రాష్ట్రంలో మరణ మృదంగం

2004 నుంచి 2014 మధ్య ఆనాటి కాంగ్రెస్ పాలనలో నేతన్నల మరణాలు దేశ వ్యాప్తంగా సంచలనం సృష్టించాయి. పాలకుల నిర్లక్ష్యమే వందలాది మంది కార్మికుల ఊపిరి ఆగేందుకు కారణమైంది. చనిపోయినప్పుడు సానుభూతి చూపడం, ఎన్నికలు రాగానే వరాలు కురిపించి ఓట్లు దండుకోవడం ఆ తదుపరి మాట మరిచి పట్టించుకోకపోవడం ఆనాటి సీమాంధ్ర సర్కారు పాలకుల నైజంగా మారింది. రెండో షోలాపూర్‌గా ప్రసిద్ధి చెందిన సిరిసిల్ల పరిశ్రమపై అడుగడుగునా నిర్లక్ష్యం చూపింది. ఫలితంగా నాటి కాంగ్రెస్ పాలనలో 402 మంది నేతన్నలు బలవర్మణానికి పాల్పడ్డారు. 2007-08లో సిరిసిల్లలో వరుస ఆత్మహత్యలు దేశవ్యాప్తంగా సంచలనం సృష్టించాయి. దీంతో వైఎస్ 2008 అక్టోబర్ 12న సిరిసిల్లలో బహిరంగ సభ పెట్టారు. సిరిసిల్లను స్పెషల్ ఎకనామిక్ జోన్‌గా చేస్తామని, వస్త్రాలకు మార్కెటింగ్ సౌకర్యం కల్పిస్తామని, అప్పారెల్ పార్కు ఏర్పాటు చేస్తామని, తదితర హామీల వర్షం కురిపించారు. కానీ 2009 ఎన్నికల్లో గెలిచిన తర్వాత పట్టించుకున్న పాపాన పోలేదు.

స్వరాష్ట్రంలో ఊపిరి

స్వరాష్ట్రం ఏర్పడిన తర్వాత సిరిసిల్ల నేతన్నల్లో కేసీఆర్ సర్కారు ఊపిరి నిలిపింది. సమైక్య రాష్ట్రంలో అలుముకున్న చీకట్లను తొలగిస్తూ.. నేతన్నలకు అండగా నిలిచింది. పలు విప్లవాత్మక నిర్ణయాలు తీసుకున్నది. స్వయంగా వస్త్ర పరిశ్రమ పెద్దలను పిలిపించి ఒక రోజంతా అప్పటి ముఖ్యమంత్రి కేసీఆర్ సమీక్ష నిర్వహించారు. నేతన్నల వేతనాలు, కూలి రెట్టింపయ్యేలా, ప్రతి కార్మికుడు నెలకు రూ.15 వేల నుంచి రూ.20 వేలు సంపాదించుకునేలా పటిష్టమైన కార్యాచరణను రూపొందించి అమలు చేశారు. అలాగే, అనేక వినూత్నమైన సంక్షేమ కార్యక్రమాలను అమల్లోకి తెచ్చారు. చేనేత మిత్ర, నేతన్నకు చేయూత కార్యక్రమాలను ప్రారంభించారు. వీటిని అమలు చేయడానికి బడ్జెట్‌ను కేటాయించారు. ప్రభుత్వం రాజీవ్ విద్యా మిషన్, సర్వశిక్ష అభియాన్ కింద దుస్తులకు సంబంధించిన ఆర్డర్లను నేతన్నలకు ఇచ్చింది. కులవృత్తిని ప్రోత్సహిస్తూనే.. పోటీ ప్రపంచాన్ని తట్టుకునేలా వారిని తీర్చిదిద్దేందుకు చర్యలు తీసుకుంది. ఇందులో భాగంగా మగ్గాల ఆధునికీకరణ, రుణాల మాఫీ, మార్కెట్‌తో అనుసంధానం వంటి కార్యక్రమాలను అమలు చేసింది. వీటితో పాటు.. బతుకమ్మ చీరెల పథకాన్ని అమల్లోకి తెచ్చి వాటి ఆర్డర్లను కూడా నేతన్నలకు అందించింది. ఫలితంగా కార్మికులకు చేతి నిండా పని దొరికింది. అక్కడితో ఆగకుండా రంజాన్, క్రిస్మస్ కానుకల్లో ఇచ్చే వస్త్రాల ఆర్డర్లు కూడా వారికి అందించింది. దీంతో సాంచాల పరిశ్రమలో సంతోషం వెల్లివిరిసింది. పవర్ లూమ్‌లను ఆధునికీకరించుకునేందుకు సబ్సిడీపై రుణాలు ఇచ్చి వస్త్ర పరిశ్రమపై ఆధారపడిన జీవితాల్లో కొత్త వెలుగులు నింపింది. వీటికితోడు నేతన్నకు బీమా పథకాన్ని అమల్లోకి తెచ్చారు కేసీఆర్. దీంతో కార్మికుల కుటుంబాలకు ధీమా లభించింది. కేసీఆర్ ప్రభుత్వ హయాంలో నేతన్నల సంక్షేమం కోసం తీసుకున్న చర్యలు, ప్రస్తుతం కాంగ్రెస్ పాలనలో పడుతున్న అవస్థలు, వాటిని పరిష్కరించడానికి తీసుకోవాల్సిన చర్యల వంటి అంశాలను పేర్కొంటూ ఈ నెల 3న ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డికి చేనేత సమస్యలపై కేటీఆర్ లేఖ రాశారు. అయినా ప్రభుత్వం మాత్రం మొండి వైఖరితో ముందుకెళ్తున్నది.

మళ్లీ చీకటి రోజులు

గత పదేళ్లలో కేసీఆర్ ప్రభుత్వం నేతన్నలకు రూ.3 వేల కోట్ల విలువైన ఆర్డర్లు ఇచ్చి అండగా నిలిచింది. యారన్ సబ్సిడీ రూ. 32.67 కోట్లు కార్మికులకు ఇచ్చింది. కానీ, కాంగ్రెస్ ప్రభుత్వం వచ్చీ రాగానే నేతన్నలపై కక్ష సాధింపు మొదలైంది. ఆర్డర్లను నిలిపివేసింది. దీంతో కార్మికులు నిరసనలు చేపట్టారు. ఆ మేరకు అత్తెసరుగా రూ.50 కోట్ల విలువ చేసే ఆర్డర్లు ఇచ్చి చేతులు దులుపుకుంది. దీంతో ఆ ఆర్డర్ల పనులు మూడునాళ్ల ముచ్చటే అయ్యాయి. ఆ తర్వాత ఆర్డర్లు ఇవ్వకపోవడంతో సిరిసిల్లలో దాదాపు 30 వేల మరమగ్గాలు మూతపడ్డాయి. ఇందులో పనిచేసే 20 వేల మంది కార్మికులు రోడ్డున పడ్డారు. ఇటీవల రాష్ట్ర బీసీ సంక్షేమ, రవాణా శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ సిరిసిల్లలో మాట్లాడుతూ గత ప్రభుత్వానికన్నా మెరుగైన ఆర్డర్లు ఇచ్చి ఉపాధి కల్పిస్తామని, పెండింగ్ బకాయిలు కూడా దశలవారీగా విడుదల చేస్తామని హామీ ఇచ్చారు. కానీ.. నేటి వరకు అందులో ఏ ఒక్క హామీ అమలు కాలేదు. దీంతో మళ్లీ చీకటి రోజులు వచ్చాయని నేతన్నలు ఆవేదనకు లోనై, బలవన్మరణాలకు పాల్పడుతున్నారు.

> ## ఇప్పుడు మాకెవరు దిక్కు?
>
> కేసీఆర్ ఉన్నప్పుడు నా కొడుకు సాయి బతుకమ్మ చీరెల బీములు నింపిండు. పదేండ్లు చేతినిండా పని ఉండి, తగ్గట్టు కూలి వచ్చింది. పక్షవాతం వచ్చి మంచాన పడ్డ నా భర్త కైలాసంను, నన్ను పోషించిండు. గిప్పుడు కాంగ్రెస్ సర్కారోళ్లు ఆర్డర్లు ఇత్తలేరని సేట్లు సాంచాలు బంద్ పెట్టిండ్రు. నాలుగు నెలల నుంచి పనిలేక ఇంట్లనే ఉంటుండు. పరిస్థితి సూసి సాయి ఏమనుకున్నడో ఏమో. కూలిపోయిన ఇంటోకి పోయి ఉరేసుకున్నడు. చెట్టంత కొడుకు మాకు దూరమైతడని అనుకోలే.
> **- అడిశర్ల పద్మ (చనిపోయిన సాయి తల్లి)**

ఆత్మహత్యలు చేసుకున్న నేత కార్మికులు

1.తడుక శ్రీనివాస్ (మరమగ్గాల కార్మికుడు)
చనిపోయిన తేదీ : 11-3-2024, బీవైనగర్, సిరిసిల్ల

2.సిరిపురం లక్ష్మీనారాయణ (62) (మరమగ్గాల కార్మికుడు)
మరణం: 6-4-2024, రాజీవ్‌నగర్, సిరిసిల్ల

3.ఈగ రాజు (45)(మరమగ్గాల కార్మికుడు)
మరణం: 22-4-2024, నెహ్రూనగర్, సిరిసిల్ల

4.అంకారపు మల్లేశం (60) (మరమగ్గాల కార్మికుడు)
మరణం: 25-04-2024
ఇందిరానగర్, తంగళ్లపల్లి మండలం

5.అడిశర్ల సాయి (26) (వార్పిన్ కార్మికుడు)
మరణం: 25-4-2024

> ## బీమా పైసలే ఆదుకున్నయ్
>
> నాకు భార్య నిర్మల, ఇద్దరు కొడుకులు. దిలీప్(22), ఆదిత్య. నేను సాంచాలు నడుపుతూ కుటుంబాన్ని పోషించుకుంటున్న. పెద్ద కొడుకు దిలీప్ మరమగ్గాల బీములు నింపే వార్పర్‌గా పనిచేస్తూ కుటుంబ పోషణలో నాకు ఆసరయ్యేటోడు. చిన్నోడు ఆదిత్య ఇంటర్ చదువుతున్నడు. గతేడాది ఆగస్టు నెలలో అనారోగ్యం బారిన పడిండు. దవాఖానలో చేర్పించినం. చికిత్స పొందుతూ నాలుగు రోజులకు చనిపోయిండు. చికిత్సకు రూ.2.50 లక్షల దాకా ఖర్చయ్యింది. అయినా బతుకలేదు. కేసీఆర్ కల్పించిన నేతన్న బీమా కింద రూ.5 లక్షలు వచ్చినయ్. అడబ్బులే మమ్మల్ని ఆదుకున్నయ్. నేను ఏండ్ల సంది సాంచాలు నడుపుతున్న. ఒకప్పుడు పన్నెండు సాంచాలు నడిపించినా నెలకు రూ.10 వేలు కూడా రాలేదు. బతుకమ్మ చీరెలు నడిపితే నెలకు రూ.15 నుంచి రూ.20 వేలు వచ్చినయ్. యారన్ సబ్సిడీ, త్రిఫ్ట్ పథకాలు మాకు అండగా నిలిచినయ్. ఆ పథకాలను అలాగే కొనసాగించాలి.
> **- దూడం లక్ష్మణ్, నేత కార్మికుడు, ఇందిరానగర్, సిరిసిల్ల**

> ## ప్రభుత్వ నిర్లక్ష్యంతోనే ఆత్మహత్యలు
>
> పదేండ్ల కేసీఆర్ పాలనలో కార్మికులకు చేతినిండా పని దొరికింది. కాంగ్రెస్ ప్రభుత్వం వచ్చాక అక్రమాలు జరిగాయంటూ వస్త్ర తయారీ ఆర్డర్లు నిలిపివేసింది. పెండింగ్ బకాయిలు రూ.300 కోట్లు ఇవ్వలేదు. గత ప్రభుత్వం ప్రవేశపెట్టిన పథకాలు యథాతథంగా కొనసాగించాలని, ఆర్డర్లు ఇచ్చి కార్మికులను ఆదుకోవాలని పలుమార్లు ప్రభుత్వానికి విన్నవించాం. నాలుగు నెలలుగా పరిశ్రమ బంద్ ఉన్నందున కార్మికులు కుటుంబాన్ని పోషించలేక ఆత్మహత్య చేసుకుంటున్నరు. చేనేత, జౌళి శాఖ కమిషనర్ కక్షసాధింపులకు పాల్పడుతున్నారు. ప్రభుత్వం విడుదల చేసిన రూ.50కోట్లు యజమానుల ఖాతాలో వేయకుండా ఆసాములకు ఇచ్చి ఇరువురి మధ్య చిచ్చు పెట్టిండ్రు. పరిశ్రమను మూసివేసేందుకు కుట్ర పన్నుతున్నరు. ఆత్మహత్యలు చేసుకున్న వారి కుటుంబానికి రూ.25 లక్షలు ఇచ్చి ప్రభుత్వం ఆదుకోవాలి.
> **- మూషం రమేశ్, పవర్‌లూం వర్కర్స్ యూనియన్ రాష్ట్ర అధ్యక్షుడు**

లోకం పోకడ

బయట ప్రచారంలో నా మీద వ్యతిరేక ప్రసంగాలు చేస్తే మీకు తిండి బంద్!

ఎండా కాలం

	గరిష్ఠం	కనిష్ఠం
నల్లగొండ	45.2°c	31.6°c
ఆదిలాబాద్	44.5°c	24.5°c
మెదక్	43.6°c	21.8°c
రంగారెడ్డి	42.9°c	18.3°c
నిజామాబాద్	42.7°c	26.8°c
మహబూబ్‌నగర్	42.3°c	29.6°c
హైదరాబాద్	42.3°c	26.3°c
కరీంనగర్	42.0°c	27.0°c
ఖమ్మం	42.0°c	25.0°c
వరంగల్	41.0°c	27.0°c

రాష్ట్రంపై 'నిప్పుల వాన'

- పలు ప్రాంతాల్లో రికార్డు స్థాయిలో ఉష్ణోగ్రతలు
- జమ్మికుంటలో అత్యధికంగా 45.6 డిగ్రీలు
- మరో ఐదు రోజులు తీవ్ర వడగాడ్పులు
- పలు జిల్లాలకు ఆరెంజ్, ఎల్లో అలర్ట్‌లు
- 28-30 మధ్యన పలు జిల్లాల్లో వర్షాలు
- హైదరాబాద్ వాతావరణ కేంద్రం వెల్లడి

హైదరాబాద్, ఏప్రిల్ 26 (నమస్తే తెలంగాణ): భగభగలాడుతున్న వేసవి భానుడు శుక్రవారం రాష్ట్రంపై 'నిప్పుల వాన' కురిపించాడు. మంచిర్యాల, నిర్మల్, నిజామాబాద్, పెద్దపల్లి, జయశంకర్ భూపాలపల్లి, ములుగు, భద్రాద్రి కొత్తగూడెం, ఖమ్మం, నల్లగొండ, వనపర్తి, జోగులాంబ గద్వాల తదితర జిల్లాల్లో తీవ్ర వడగాడ్పులు వీచడంతో ఈ సీజన్‌లోనే రికార్డు స్థాయి ఉష్ణోగ్రతలు నమోదయ్యాయి. పలు జిల్లాల్లో గరిష్ఠ ఉష్ణోగ్రతలు 45 సెల్సియస్ డిగ్రీలకుపైగా నమోదైనట్టు హైదరాబాద్ వాతావరణ కేంద్రం వెల్లడించింది. అత్యధికంగా కరీంనగర్ జిల్లా జమ్మికుంటలో 45.6, నల్లగొండ జిల్లా నిడమనూర్, పెద్దపల్లి జిల్లా మంథనిలో 45.2, యాదాద్రి భువనగిరి జిల్లా మర్యాల, కరీంనగర్ జిల్లా వీణవంక, జగిత్యాల జిల్లా వెల్లటూర్, కాల్వాయి, నల్లగొండ జిల్లా మాడ్గులపల్లిలో 45.1, నల్లగొండ జిల్లా మాటూర్‌లో 45, కానాయిపల్లిలో 45 డిగ్రీల ఉష్ణోగ్రతలు నమోదైనట్టు వివరించింది. జిల్లాలవారీగా భద్రాద్రి కొత్తగూడెంలో 43.5, నిజామాబాద్‌లో 43.4, నల్లగొండ, ఖమ్మం, రామగుండంలో 43, మహబూబ్‌నగర్, మెదక్‌లో 42.5, ఆదిలాబాద్‌లో 42.3, హనుమకొండలో 41.5 డిగ్రీల ఉష్ణోగ్రతలు నమోదైనట్టు తెలిపింది. రానున్న ఐదు రోజులు పలు జిల్లాల్లో వడగాడ్పులు వీస్తాయని, ఈ నేపథ్యంలో అత్యవసరమైతే తప్ప ఎవరూ ఇండ్ల నుంచి బయటకు రావొద్దని హెచ్చరించింది. శనివారం మంచిర్యాల, నిర్మల్, నిజామాబాద్, జగిత్యాల, రాజన్న సిరిసిల్ల, కరీంనగర్, పెద్దపల్లి, జయశంకర్ భూపాలపల్లి, ములుగు, భద్రాద్రి కొత్తగూడెం, ఖమ్మం, నల్లగొండ, సూర్యాపేట, మెదక్, కామారెడ్డి జిల్లాల్లో వడగాడ్పులు వీస్తాయంటూ ఎల్లో అలర్ట్ జారీ చేసింది. ఆదివారం నాగర్‌కర్నూల్, వనపర్తి, నారాయణపేట, జోగులాంబ గద్వాల జిల్లాల్లో వడగాడ్పులు వీస్తాయంటూ ఆరెంజ్ అలర్ట్ జారీ చేసింది. 30న భద్రాద్రి కొత్తగూడెం, ఖమ్మం, నల్లగొండ, సూర్యాపేట, మహబూబ్‌నగర్, నాగర్‌కర్నూల్, వనపర్తి, నారాయణపేట, జోగులాంబ గద్వాల జిల్లాల్లో వడగాడ్పులు వీస్తాయని పేర్కొన్నది.

వర్ష సూచన

ఇదే సమయంలో పలు జిల్లాల్లో వర్షాలు కురిసే అవకాశాలున్నట్టు తెలిపింది. 28న కుమ్రంభీం ఆసిఫాబాద్, ఆదిలాబాద్, మంచిర్యాల, నిర్మల్, నిజామాబాద్, జగిత్యాల, రాజన్న సిరిసిల్ల, కరీంనగర్, పెద్దపల్లి, జయశంకర్ భూపాలపల్లి, ములుగు, భద్రాద్రి కొత్తగూడెం జిల్లాల్లో అక్కడక్కడ ఉరుములు, మెరుపులు, ఈదురుగాలులతో కూడిన వర్షాలు కురుస్తాయని పేర్కొంది. 29న ఉమ్మడి ఆదిలాబాద్, నిజామాబాద్, కరీంనగర్, జయశంకర్ భూపాలపల్లి, ములుగు, భద్రాద్రి కొత్తగూడెం జిల్లాల్లో వర్షాలు కురుస్తాయని తెలిపింది. 30న జయశంకర్ భూపాలపల్లి, ములుగు, నల్లగొండ, సూర్యాపేట, మహబూబాబాద్, వరంగల్, హనుకొండ, జనగామ, సిద్దిపేట, యాదాద్రి భువనగిరి, రంగారెడ్డి, హైదరాబాద్, మేడ్చల్ మల్కాజిగిరి, వికారాబాద్, సంగారెడ్డి, మెదక్, కామారెడ్డి, మహబూబ్‌నగర్, నాగర్‌కర్నూల్, నారాయణపేట, జోగులాంబ గద్వాల జిల్లాల్లో ఈదురుగాలులతో కూడిన వర్షాలు కురిసే అవకాశం ఉన్నట్టు వివరించింది.

కొండా సురేఖకు ఈసీ వార్నింగ్

- కేసీఆర్, కేటీఆర్‌లపై నిందారోపణలు సరికాదని హితవు

హైదరాబాద్, ఏప్రిల్ 26 (నమస్తే తెలంగాణ): బీఆర్ఎస్ అధినేత కేసీఆర్, వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్‌పై అనుచిత వ్యాఖ్యలు చేసిన రాష్ట్ర అటవీ శాఖ మంత్రి కొండా సురేఖకు కేంద్ర ఎన్నికల సంఘం (ఈసీ)వార్నింగ్ ఇచ్చింది. రాజకీయ పార్టీలు, వ్యక్తులపై నిందారోపణలు చేయడం సరికాదని ఆమెను హెచ్చరించింది. ఇకపై ఎన్నికల సభలు, సమావేశాలు, పత్రికా సమావేశాల్లో ఎన్నికల కోడ్ ఉల్లంఘించే విధంగా మాట్లాడొద్దని సూచిస్తూ శుక్రవారం ఆమెకు ఓ లేఖ రాసింది. ఈ నెల 1న కొండా సురేఖ వరంగల్ తూర్పు నియోజకవర్గంలోని తన క్యాంపు కార్యాలయంలో మీడియా సమావేశంలో మాట్లాడుతూ.. ఫోన్ల ట్యాపింగ్ వ్యవహారంలో కేసీఆర్, కేటీఆర్‌లపై వ్యక్తిగత ఆరోపణలు చేసిన విషయం విదితమే. దీనిపై బీఆర్ఎస్ నేతలు కర్నె ప్రభాకర్, దాసోజు శ్రవణ్ ఫిర్యాదు చేయడంతో ఎన్నికల సంఘం స్పందించింది. ఆ మీడియా సమావేశంలో సురేఖ ఏం మాట్లాడారో నివేదిక ఇవ్వాలని జిల్లా కలెక్టర్‌ను ఆదేశించింది. ఫిర్యాదులో పేర్కొన్న విధంగానే సురేఖ వ్యాఖ్యలు ఉన్నాయని కలెక్టర్ ధ్రువీకరించడంతో ఆమెను ఎన్నికల సంఘం హెచ్చరించింది.

రైతుబంధు ఏమైంది సీతక్క?

- 3 ఎకరాలకు పడలేదని రైతు ఆగ్రహం
- బ్యాంకు లోపం కావచ్చని చెప్పి వెనుదిరిగిన మంత్రి

ములుగు, ఏప్రిల్ 26 (నమస్తే తెలంగాణ) : పంట పెట్టుబడి సాయం తమకు అందలేదని మంత్రి సీతక్కను రైతులు నిలదీశారు. ములుగు జిల్లా వెంకటాపూర్ మండలం కేశవాపూర్‌లో శుక్రవారం ఎన్నికల ప్రచారంలో భాగంగా ఆమె ఉపాధి హామీ కూలీల వద్దకు వెళ్లి కాంగ్రెస్‌కు ఓటు వేయాలని అభ్యర్థిస్తుండగా గ్రామానికి చెందిన రైతు జంబుల నర్సయ్య రైతుబంధు విషయమై మండిపడ్డారు. తనకు మూడు ఎకరాల భూమి ఉన్నదని, పెట్టుబడి సాయం ఎందుకు అందించడం లేదని మంత్రిని నిలదీశారు. గ్రామ ముఖ్య నాయకులను ఉద్దేశించి నర్సయ్య మాట్లాడుతూ.. రైతుబంధు పైసలు ఎందుకు పడలేదో అడగాలని కోరుతూ మంత్రి ప్రసంగానికి అడ్డుపడ్డారు. దీంతో అక్కడ ఉన్న మహిళలు సైతం ఆరు గ్యారెంటీలపై నిలదీశారు. చేసేదేమీ లేక మంత్రి సీతక్క ప్రసంగాన్ని ఆపి రైతు బంధు పైసలు బ్యాంకులో సమస్య వల్ల పడకపోవచ్చని, బ్యాంకుకు వెళ్లి చూసుకోవాలని సముదాయించి వెనుదిరిగారు.

రేవంత్‌రెడ్డి ఓ బ్రోకర్

ఎమ్మార్పీఎస్ అధ్యక్షుడు మందకృష్ణమాదిగ

హనుమకొండ చౌరస్తా, ఏప్రిల్ 26: రేవంత్ రెడ్డి ఓ బ్రోకర్.. ఉద్యమం చేసి సీఎం కాలేదు, బ్రోకరిజం చేస్తూ సీఎం అయ్యాడని ఎమ్మార్పీఎస్ వ్యవస్థాపక అధ్యక్షుడు మందకృష్ణ మాదిగ విమర్శించారు. శుక్రవారం హనుమకొండ హరిత కాకతీయ హోటల్‌లో జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడారు. కడియం శ్రీహరిని ఎమ్మెల్యే పదవికి రాజీనామా చేయాలని ఎందుకు అడగలేదని ప్రశ్నించారు. ఒక పార్టీలో గెలిచి ఇతర పార్టీలో చేరితే పిచ్చి కుక్కల్లా రాళ్లతో కొట్టాలని సీఎం చెప్పారని, ఇప్పుడు కడియంను కొట్టాల్సిందే కదా? అని అడిగారు. రేవంత్, కడియం శ్రీహరిపై ఎవరైనా రాళ్లు వేయొచ్చని పేర్కొన్నారు. కడియం శ్రీహరి ఎస్సీ కాదని చెప్పిందే రేవంత్‌రెడ్డి అని తెలిపారు. కడియం శ్రీహరి ఎస్సీ కానప్పుడు కావ్య ఎలా ఎస్సీ అవుతారని, ఆమెకు వరంగల్ ఎంపీ టికెట్ ఎలా ఇచ్చారని ప్రశ్నించారు. మాల, మాదిగల నుంచి రేవంత్‌రెడ్డి ప్రతిఘటన ఎదుర్కోక తప్పదని హెచ్చరించారు. దేవుడి పేరుతో రాజకీయాలు చేస్తున్నది బీజేపీ కాదని, రేవంత్ రెడ్డేనని స్పష్టం చేశారు. ఎక్కడికెళ్లినా దేవుళ్ల పేర్ల మీద ఒట్టు వేస్తున్నాడని మండిపడ్డారు.

మంద, బాబూమోహన్ నామినేషన్ల తిరస్కరణ

వరంగల్, ఏప్రిల్ 26(నమస్తేతెలంగాణ)/ మహబూబాబాద్ రూరల్/ నాగర్‌కర్నూల్: లోక్‌సభ ఎన్నికల నామినేషన్ల పరిశీలనలో భాగంగా నాగర్‌కర్నూల్ బీఎస్పీ అభ్యర్థి మంద జగన్నాథం, వరంగల్ ఇండిపెండెంట్ అభ్యర్థి బాబూమోహన్ నామినేషన్లు తిరస్కరణకు గురయ్యాయి. శుక్రవారం చేపట్టిన స్క్రూటినీలో నాగర్‌కర్నూల్‌లో 13, వరంగల్ నియోజకవర్గంలో పది మంది నామినేషన్లను ఎన్నికల అధికారులు తిరస్కరించారు. ఇందులో స్వతంత్ర అభ్యర్థిగా నామినేషన్ దాఖలు చేసిన సినీ నటుడు బాబూమోహన్ కూడా ఉన్నారు. ఆదిలాబాద్ బీజేపీ ఎంపీ అభ్యర్థి గోడం నగేశ్ నామినేషన్ వివాదాస్పదంగా మారింది. నగేశ్ నామినేషన్ సందర్భంగా సమర్పించిన అఫిడవిట్‌లో పూర్తి వివరాలు వెల్లడించలేదంటూ బీఎస్పీ అభ్యర్థి ట్విట్టర్‌లో ఎన్నికల సంఘానికి ఫిర్యాదు చేయగా, కాంగ్రెస్ నాయకులు రిటర్నింగ్ అధికారి కార్యాలయం ముందు ఆందోళనకు దిగారు.

అప్పుల బాధతో ఇద్దరు రైతుల ఆత్మహత్య

- జనగామ, వికారాబాద్ జిల్లాల్లో ఘటనలు

ఉచ్చెంతల శ్రీను, అనంతయ్య (ఫైల్)

జనగామ, ఏప్రిల్ 26 (నమస్తే తెలంగాణ)/నర్మెట/ధారూరు : పంటలు చేతికి రాక, చేసిన అప్పులు తీర్చే మార్గం లేక జనగామ, వికారాబాద్ జిల్లాల్లో ఇద్దరు రైతులు ఆత్మహత్య చేసుకున్నారు. వివరాలు ఇలా.. జనగామ జిల్లా తరిగొప్పుల మండలం సోలిపురానికి చెందిన రైతు ఉచ్చెంతల శ్రీను (47) నాలుగు ఎకరాల్లో వేసిన వరి పంటను కాపాడుకునేందుకు నాలుగు బోర్లు వేసి నీళ్ల పడక.. కండ్ల ముందే పచ్చటి పొలం ఎండిపోయింది. సాగుపై పెట్టిన పెట్టుబడికి అదనంగా బోర్ల కోసం చేసిన ఖర్చు.. పైగా గత ఏడాది కొత్తగా కట్టుకున్న ఇంటి నిర్మాణానికి చేసిన అప్పు తోడైంది. పంట ఎండి.. తెచ్చిన అప్పులు తీర్చే దారి లేక తీవ్ర మనస్తాపానికి గురైన శ్రీను శుక్రవారం వ్యవసాయ బావి వద్దకు వెళ్లి చెట్టుకు ఉరివేసుకున్నాడు. సమీప రైతులు చూసి వెంటనే జనగామ జిల్లా దవాఖానకు తరలిస్తుండగా మార్గమధ్యంలో మృతి చెందాడు. 10 ఎకరాల భూమి ఉన్న ఆసామిగా శ్రీను 30 ఏండ్లుగా వ్యవసాయం చేస్తున్నాడు. నిరుడు ఇంటి నిర్మాణం కోసం, బోర్లు వేసేందుకు, సాగు పెట్టుబడికి రూ.పది లక్షలు అప్పు చేశాడు. వాటిని తీర్చలేక ఆత్మహత్య చేసుకున్నాడు. మృతుడికి భార్య లక్ష్మి, ముగ్గురు కొడుకులు రాకేశ్, అరవింద్, కార్తీక్ ఉన్నారు. పెద్ద కొడుకు రాకేశ్‌కు ఇటీవలే పెండ్లి కుదిరింది. ఆగస్టులో ముహూర్తం పెట్టుకుందాం అనుకునేలోపు ఇంటి పెద్ద ఆత్మహత్యతో ఆ కుటుంబం విషాదంలో మునిగింది. తరిగొప్పుల పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

నాగారంలో పురుగుమందు తాగి..

వికారాబాద్ జిల్లా ధారూరు మండలం నాగారం గ్రామానికి చెందిన ముసలిగల అనంతయ్య (42)కు 30 గుంటల పట్టా పొలం, ఆయన భార్య పేరిట లావాణి పట్టా 2 ఎకరాలు ఉన్నది. 30 గుంటల పొలంలో వరి, 2 ఎకరాల్లో కంది, మక్క సాగు చేశాడు. వర్షాలు లేక కంది, మక్క పంటలు ఎండిపోయి నష్టం జరిగింది. రూ.3 లక్షలు అప్పు చేసి ఇల్లు కట్టుకున్నాడు. ఎవుసం సాగక, అప్పు తీర్చే దారి లేక తరుచూ బాధపడేవాడని స్థానికులు తెలిపారు. ఈ క్రమంలో ఈ నెల 22న మధ్యాహ్నం పురుగుల మందు తాగి ఆయనే వెళ్లి తాండూరు దవాఖానలో చేరాడు. ఈ నెల 25న మెరుగైన చికిత్స కోసం వికారాబాద్ ప్రభుత్వ దవాఖానకు తరలిస్తుండగా మార్గమధ్యంలో స్పృహ కోల్పోయాడు. దవాఖానకు తీసుకెళ్లగా అప్పటికే మృతి చెందినట్టు వైద్యులు ధ్రువీకరించారు. మృతుడి భార్య లక్ష్మి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్టు పోలీసులు తెలిపారు.

ఐఎన్సీ అంటే ఇటలీ నేషనల్ కాంగ్రెస్

దేశానికి పట్టిన దరిద్రం ఆ పార్టీ • బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు కిషన్‌రెడ్డి



హైదరాబాద్, ఏప్రిల్ 26 (నమస్తే తెలంగాణ): దేశంలో బ్రిటిష్ వారసత్వాన్ని కాంగ్రెస్ పార్టీ కొనసాగిస్తున్నదని బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు కిషన్‌రెడ్డి వ్యాఖ్యానించారు. ఐఎన్సీ అంటే ఇండియన్ నేషనల్ కాంగ్రెస్ కాదని 'ఇటలీ నేషనల్ కాంగ్రెస్' అని ఎద్దేవా చేశారు. శుక్రవారం ఆయన బీజేపీ రాష్ట్ర కార్యాలయంలో మీడియాతో మాట్లాడారు. బ్రిటిష్ ప్రతినిధిగా ఇటలీకి చెందిన సోనియాగాంధీని దేశంపై రుద్దే ప్రయత్నం చేశారని, ఆమె ప్రధాని కాకుండా బీజేపీ అడ్డుకున్నదని చెప్పారు. పదేండ్ల కింద ఇటలీ కాంగ్రెస్‌ను ప్రజలు వదిలించుకున్నారని, మళ్లీ ఆ పార్టీని ప్రజలు దగ్గరకు రానిచ్చే ప్రసక్తే ఉండబోదని స్పష్టం చేశారు. బీజేపీ పక్కా లోకల్ పార్టీ అని చెప్పారు. ప్రస్తుతం దేశంలోని అన్ని సమస్యలకు కారణం కాంగ్రెస్సే అని, దేశానికి పట్టిన దరిద్రం ఆ పార్టీ అని ధ్వజమెత్తారు. కేంద్రంలో బీజేపీ ప్రభుత్వం వస్తే రిజర్వేషన్లు ఉండవంటూ ప్రచారం చేస్తున్నారని, 'మతి భ్రమించి మాట్లాడుతున్నారా?' అంటూ తీవ్ర స్థాయిలో ధ్వజమెత్తారు. ముస్లిం రిజర్వేషన్లను ఏ ప్రాతిపదికన తీసుకొచ్చారని ప్రశ్నించారు. తెలంగాణలో బీసీల రిజర్వేషన్లకు గండి కొడుతున్నదని ఎవరో సీఎం రేవంత్‌రెడ్డి చెప్పాలని డిమాండ్ చేశారు. ముస్లింలను బీసీలుగా మారుస్తున్నారని, ఇది బీసీలకు అన్యాయం చేయడం కాదా? అని ప్రశ్నించారు. తాము మళ్లీ అధికారంలోకి వస్తే ముస్లిం రిజర్వేషన్లను బరాబర్ రద్దు చేస్తామని చెప్పారు.

బీజేపీ అంటే బ్రిటిష్ జనతా పార్టీ

- రిజర్వేషన్ల రద్దుకే బీజేపీకి 400 సీట్లు కావాలట
- మోదీ కాలనాగులాంటోడు.. పగబడతాడు: రేవంత్

మెదక్, ఏప్రిల్ 26 (నమస్తే తెలంగాణ): బీజేపీ అంటే భారతీయ జనతా పార్టీ కాదని, బ్రిటిష్ జనతా పార్టీ అని సీఎం రేవంత్‌రెడ్డి అన్నారు. మతాలు, జాతుల మధ్య చిచ్చు పెట్టి దేశాన్ని దోచుకోవాలని బీజేపీ ప్రయత్నిస్తున్నదని విమర్శించారు. శుక్రవారం మెదక్ జిల్లా పెద్దశంకరంపేటలో కాంగ్రెస్ పార్టీ నిర్వహించిన జన జాతర సభలో ఆయన మాట్లాడారు. రిజర్వేషన్లు రద్దు చేసేందుకే 400 సీట్లు కావాలని బీజేపీ నేతలు అంటున్నారని విమర్శించారు. 'మేమిద్దరం.. మాకు ఇద్దరు' అన్నట్టు మోదీ, అమిత్‌షాకు అదానీ, అంబానీ తోడయ్యారని ఆరోపించారు. నల్ల చట్టాలపై కొట్లాడిన రైతులపై మోదీ పగపట్టారని ఆరోపించారు. రాజ్యాంగాన్ని సమూలంగా మార్చి రైతులను అదానీ, అంబానీలకు బానిసలుగా మార్చాలని చూస్తున్నారని విమర్శించారు.

నియమావళిని ఉల్లంఘించిన సీఎం

సీఎం రేవంత్‌రెడ్డి పెద్దశంకరంపేటలో నిర్వహించిన సభలో హామీలిచ్చి ఎన్నికల నియమావళిని ఉల్లంఘించారు. ఇంటర్ విద్యార్థుల కోసం మహిళా పాలిటెక్నిక్ కళాశాల, ఐటీఐ, పీజీ కళాశాల, ఇండస్ట్రియల్ క్లస్టర్, ప్రాంతీయ పారిశ్రామీకరణ కేంద్రం ఏర్పాటు, సంగమేశ్వర, బసవేశ్వర ప్రాజెక్టుల నిర్మాణంతోపాటు పెద్దశంకరంపేటలో డిగ్రీ కళాశాల మంజూరు చేస్తానని రేవంత్‌రెడ్డి ప్రకటించారు.

పన్ను చెల్లించకుంటే.. కరెంట్ 'కట్'

- పట్టణ ప్రజలకు జనగామ పురపాలక కమిషనర్ హెచ్చరిక

జనగామ, ఏప్రిల్ 26 (నమస్తే తెలంగాణ) : 'ఇందుమూలంగా జనగామ పట్టణ ప్రజలకు తెలియజేయునది ఏమనగా, ఇంటి పన్ను వడ్డీపై 90శాతం రిబేట్ (రాయితీ) ఇచ్చినప్పటికీ కొంత మంది ఇంటి పన్ను చెల్లింపుదారులు వినియోగించుకోలేదు. దీంతో మున్సిపాలిటీ అభివృద్ధికి ఆటంకం కలుగుతున్నది. మున్సిపాలిటీకి చెల్లించాల్సిన ఇంటి పన్నుల చెల్లింపులో అలసత్వం వహించినందున మీ ఇంటికి విద్యుత్తు సరఫరా నిలిపివేస్తామని తెలియజేస్తున్నాము'.. ఇది జనగామ పురపాలక సంఘం కమిషనర్ విడుదల చేసిన పత్రికా ప్రకటన సారాంశం. పన్ను చెల్లించని వారి ఇండ్లకు కరెంటు కట్ చేస్తామని పట్టణ ప్రజలను హెచ్చరిస్తూ జనగామ పురపాలక కమిషనర్ విడుదల చేసిన ప్రకటనపై పట్టణ ప్రజలు మండిపడుతున్నారు. పన్ను చెల్లింపునకు పవర్ కట్‌కు..మున్సిపల్ కమిషనర్‌కు ఏం సంబంధం..? ఇది ప్రజా పాలనా? లేక ప్రజలను భయపెట్టే పాలనా? అంటూ జనం అగ్గిమీద గుగ్గిలం అవుతున్నారు. గతంలో ఏనాడూ ఇలాంటి ప్రకటన చూడలేదని..ఇంటి పన్ను చెల్లించకుంటే నల్లా (కుళాయి) నీటి సరఫరా నిలిపివేస్తామని హెచ్చరికలు చేయడం చూశాం కానీ..ఇంటికి కరెంటు కట్ చేస్తామని బెదిరించడం ఏమిటని ప్రశ్నిస్తున్నారు. ఇంటి పన్నులు, నల్లా పన్ను మున్సిపల్ పరిధిలోని అంశం.. కరెంటు ట్రాన్స్‌కో పరిధిలోని అంశం.. మరి మున్సిపల్ కమిషనర్ కరెంటు ఎలా కట్ చేస్తారు? అంటూ జనం విస్మయం వ్యక్తం చేస్తున్నారు.